ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబర్ 2023 5 అనంతపురం



నేరప్రవృత్తితో జీవితాలు నాశనం

ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్


షికారీ కాలనీలోని పిల్లలతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నేర ప్రవృత్తితో జీవితాలు నాశనం అవుతాయని, దానిని విడనాడి పరివర్తన దిశగా వెళితే అన్ని విధాలా మేలు జరుగుతుందని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖ, ఆర్డీటీ, దాతల సహకారంతో అనంతపురంలోని షికారీ కాలనీలో విద్య, వైద్యం, ఆరోగ్యం మెరుగుదల కోరుతూ మంగళవారం నాడు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. షికారీ కాలనీకి చెందిన 80 మంది పిల్లలకు సోప్స్, బ్రష్, ఫేస్టు, బట్టల సోపులు, ఆయిల్ కలిగిన కిట్లను పంపిణీ చేశారు. బత్తలపల్లి ఆర్డీటీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. దాతల సహకారంతో 135 మంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జత దుస్తులు, స్వెట్టర్లు అందజేశారు. రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఫౌండర్ భరత్ తన వంతుగా కాలనీ విద్యార్థులకు 2 కంప్యూటర్లు, 1 ప్రొజెక్టర్ అందజేశారు. కాలనీలో కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి అవసరమైన ఆపరేషన్లు మీనాక్షమ్మ ఐ ఛారిటబుల్ ట్రస్టు తరుపున చేయిస్తామని ఆ సంస్థ నిర్వాహకుడు రమణ హామీ ఇచ్చారు. రాప్తాడు ఎస్సీ సంఘం ఆధ్వర్యంలో కాలనీలోని 20 కుటుంబాలకు 6 నెలల సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ షికారీ పిల్లలకు ఏదైనా విద్య, తదితరాల అభివద్ధి సహకారం కోసం జిల్లా పోలీసుశాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని తెలియజేశారు. ఆర్డీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ షికారీ కాలనీ వాసులు, వారి పిల్లల అభివద్ధికి తమతో పాటు తోడ్పడుతున్న దాతలకు అభినందనలు తెలియజేశారు. సమిష్టిగా తోడ్పడితేనే అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఆర్డీటీ డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, రఫీ, వన్‌టౌన్ సిఐ రెడ్డెప్ప, డీసీఆర్బీ సిఐ విశ్వనాథచౌదరి, దాతలు తాడిపత్రి రవి ప్రకాష్, బాబ్జాన్, భరత్, రమణ, కిరణ్ పాల్గొన్నారు.

సామాజిక సాధికారత ఇదేనా..?!

- శాసనసభ స్థానాల్లో 50 శాతం కేటాయించేరా..
- స్థానిక సంస్థలు, కార్పొరేషన్లకే పరిమితమా
- వైసిపి సామాజిక సాధికార యాత్రల నేపథ్యంలో చర్చ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బీసీలంటే బ్యాక్‌వర్డు కాదు... బ్యాక్‌బోన్ అంటూ వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్రను చేపట్టింది. ఈ సందర్భంగా నేతలు వైసిపి అధికారంలోకి వచ్చాక బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని ప్రకటిస్తున్నారు. జనాభాలో 50 శాతమున్న బిసిలకు పదవుల్లోనూ 50 శాతం స్థానాలు కేటాయిస్తున్నామని చెబుతున్నారు. ఈ పదవులన్నీ ఇప్పటి వరకు చూస్తే స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల కేటాయింపుల వరకే ఉన్నాయన్న విమర్శలున్నాయి. విధానపరమైన నిర్ణయాలు జరిగే శాసనసభకు పోటీ చేసే అసెంబ్లీ స్థానాలకు టిక్కెట్లు కేటాయించే విషయంలో లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

66 శాతం ఒసిలకే ..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇందులో రెండు రిజర్వు స్థానాలుపోనూ 12 జనరల్ స్థానాలున్నాయి. ఇందులో చూసినప్పుడు 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎనిమిది అసెంబ్లీ సీట్లకు ఓసి అది కూడా రెడ్డి సామాజిక తరగతికి చెందిన వారికే టిక్కెట్టును వైసిపి కేటాయించింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, పెనుకొండ, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు స్థానాలు బీసీలకు, ఒక స్థానం మైనార్టీకి కేటాయించారు. తక్కిన ఎనిమిది నియోజకవర్గాల్లో ఓసిలకే టిక్కెట్లు ఇచ్చారు. అందులోనూ కళ్యాణదుర్గం మంత్రి ఉషచరణ్‌శ్రీ ఉన్నారు. ఆమె భర్త చరణ్‌రెడ్డి ఓసి సామాజిక వర్గానికి చెందన వారనే విమర్శ ఉంది. ఇక రిజర్వు నియోజకవర్గాల్లో ఇదే రకమైన విమర్శ కనిపిస్తోంది. శింగనమల ఎస్సీ రిజర్వు స్థానం నుంచి జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డే రాజకీయ వ్యవహారాలు నియోజకవర్గంలో చూస్తారు. పేరుకు పద్మావతి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ వ్యవహారాలు అన్నీ చూస్తుండటంతో ఇందులో సామాజిక న్యాయం ఏ రకంగా అవుతుందన్న ప్రశ్నలు సర్వత్రా లేవనెత్తుతున్నారు. తాజాగా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగాఉన్న ఇక్బాల్‌ను తొలగించాక దీపికారెడ్డిని పెట్టారు. ఆమె బిసి అయినప్పటికీ భర్త వేణుగోపాల్‌రెడ్డి ఓసీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. రాజకీయాల్లో కీలకమైన అసెంబ్లీ స్థానాలకు టిక్కెట్లు కేటాయించే విషయంలో సామాజిక సాధికారత ఎక్కడుందన్న ప్రశ్నను సామాజికవేత్తలు లేవనెత్తుతున్నారు.

టిడిపిలోనూ 50 శాతానికిపైగా ఓసిలే

2019 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓసిలకే అధిక ప్రాధాన్యతనిచ్చిందన్న విమర్శ ఉంది. వైసిపి రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పిస్తే టిడిపి కమ్మ సామాజికవర్గానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. 14 అసెంబ్లీ స్థానాల్లో ఐదు స్థానాల్లో వారికే టిక్కెట్లు కేటాయించింది. అనంతపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, ధర్మవరం, హిందూపురం అసెంబ్లీ స్థానాల్లో కమ్మ సామాజికవర్గానికి చెందిన వారుండగా, పుట్టపర్తి, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందినవారున్నారు. 14 అసెంబ్లీ స్థానాల్లో ఎనిమిది స్థానాల్లో ఓసిలకు చోటు కల్పించారు. కదిరి, గుంతకల్లు, రాయదుర్గం, పెనుకొండ మాత్రమే బిసిలకు కేటాయించారు. తక్కిన రెండు స్థానాలు రిజర్వు నియోజకవర్గాలున్నాయి. ఈ రకంగా చూస్తే రెండు ప్రధాన పార్టీలు కూడా బిసి, ఎస్సి,మైనార్టీలకు కేటాయిచిన సీట్ల ప్రాధాన్యత ఏ పాటితో అర్థమవుతుంది. మాటల్లో సామాజిక సాధారికాత, ప్రధానమైన పదవుల వరకు వచ్చే సరికి ఓసీల వైపే రెండు ప్రధాన పార్టీలు మొగ్గు చూపుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుని, యువతకు ఉపాధి మెరుగు పరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఏఏ ప్రాంతాల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.. ఎంత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి... సాధ్యాసాధ్యాలను క్షుణ్ణంగా నేతలు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ కరువు జిల్లాలో పిరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. స్థానికంగా సహజ వనరుల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాయదుర్గం ప్రాంతంలో ఖుద్రేముఖ్ తరహా ఇనుప పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతపురం నగరాన్ని రాప్తాడు మండలాన్ని కలిపి గార్మెంట్ సిటీగా ప్రకటించి స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దగ్గర సైబర్ టవర్ నిర్మించాలన్నారు. గుత్తి నుంచి రాప్తాడు వరకు ఉన్న జాతీయ రహదారి వెంట చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గ్రానైట్ ఆధారిత పరిశ్రమలు, టమోటా, మామిడి పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే సదుపాయాలు ఉన్న గుత్తి, గుంతకల్లు ప్రాంతాల్లో ప్రాసెసింగ్ యూనిట్లను, శింగనమలలో లెదర్ ఇండ్రస్టీని ఏర్పాటు చేయాలన్నారు. రాయదుర్గంలో జీన్స్, పామిడి టెక్స్‌టైల్స్ పార్కును అభివృద్ధి చేయాలన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు, ప్రాంతాల్లో వ్యవసాయ పంట ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చేయాలన్నారు. ప్రారంభ ఐటి పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. గుత్తి, తాడిపత్రి, కూడేరు ప్రాంతాలను చారిత్రక, పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార పద్ధతిలో సోలార్ యూనిట్స్ నెలకొల్పాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 5 భారీ పరిశ్రమలు ఉన్నాయని, వీటిల్లో 6,700 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలు 3002 ఉండగా అందులో 9500 మంది పని చేస్తున్నారని తెలిపారు. ఇక్కడ పని చేసేవారు జిల్లా జనాభాలో కేవలం 0.0072 శాతం మాత్రమే అన్నారు. 2021- 24 మధ్య కాలంలో ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో ఏర్పాటు కాలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి విజ్ఞాపనను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ప్రభుత్వం కూడా జిల్లాలో పారిశ్రామికరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

వాలంటీర్ మోసం..!

- పింఛన్‌పేరుతో వేలిముద్రలు తీసుకుని భూమికాజేత
- బంధువుల పేరుపై శాశ్వత అగ్రిమెంట్
- పోలీసులు, అధికారులకు బాధితురాలి ఫిర్యాదు


తనకు జరిగిన అన్యాయాన్ని ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు నాగేశ్వరమ్మ

ప్రజాశక్తి-పుట్లూరు

ఆరోగ్య సురక్ష, పింఛన్ మార్పులు చేస్తానంటూ ఓ వాలంటీర్ మహిళను మోసం చేశాడు. దస్తావేజుల్లో వేలిముద్రలు తీసుకుని ఏకంగా ఆమెకు సంబంధించిన భూమిని ఇతరులకు శాశ్వత అగ్రిమెంట్ చేయించేశాడు. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న బాధితురాలు తనకు న్యాయం చేయాలంటూ అధికారులను మంగళవారం నాడు వేడుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పుట్లూరు మండలం ఎస్.గూడూరు గ్రామానికి చెందిన నాగేశ్వరమ్మ భర్త ఐదు నెలల క్రితం మతి చెందాడు. భర్త పేరు మీద ఉన్న 2.77 ఎకరాలను నాగేశ్వరమ్మ పేరుపై మార్చుకుంది. ఈమెకు పిల్లలు లేకపోవడంతో ఆస్తిని కాజేయాలని కొందరు కుట్రకు తెరలేపారు. ఎస్.గూడూరు గ్రామానికి చెందిన వాలంటీర్ బి.రమేష్ తన బంధువైన నరేష్‌కు నాగేశ్వరమ్మ భూమి చెందేలా పతకం రచించారు. కొద్ది రోజుల క్రితం వాలంటీర్ రమేష్ నాగేశ్వరమ్మ దగ్గరికి వెళ్లాడు. ఆరోగ్య సురక్ష, పింఛన్ మార్పుల కోసం వేలిముద్ర వేయాలని ఆమెకు చెప్పాడు. నరేష్‌కు శాశ్వత అగ్రిమెంట్ చేస్తూ ముందేతయారు చేసుకున్న పత్రాలపై ఆమె వేలిమద్రలు తీసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత అనుమానం వచ్చిన నాగేశ్వరమ్మ ఈ విషయంపై బంధువులకు తెలిపింది. తాను పేపర్లపై ఐదు సార్లు వేలిముద్రలు వేశానని చెప్పింది. అనుమానం వచ్చి బంధువుల సాయంతో పోలీసులకు తెలిపింది. దీనిపై పోలీసులు వాలంటీర్ రమేష్, నరేష్‌ను విచారించారు. అయితే తాము అలాంటి పని ఏమీ చేయలేదని చెప్పారు. దీంతో ఈ సమస్య సర్దుమనిగింది. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన కోర్టు ద్వారా నాగేశ్వరమ్మకు ఓ నోటీసు వచ్చింది. ఇందులో 2.77 ఎకరాల భూమిని తనకు శాశ్వత అగ్రిమెంట్ చేశారని, ఈ మేరకు తనకు ఆ భూమిని ఇవ్వాలని నరేష్ పేరుతో నోటీసులను పంపించాడు. దీంతో బాధిత మహిళ నాగేశ్వరమ్మ తీవ్ర ఆందోళనకు గురైంది. వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. అనంతరం ఎంపిడిఒ యోగానందరెడ్డిని కలిసి జరిగిన అన్యాయాన్ని వివరించింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు.

అర్హులందరికీ నవరత్నాల లబ్ధి

- వైసిపి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి
- మంత్రులు జయరాం, ఉషశ్రీచరణ్


సామాజిక సాధికర బస్సుయాత్రలో ప్రసంగిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-రాయదుర్గం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల లబ్ధిని అందిస్తున్నట్లు రాష్ట్ర మంత్రులు గుమ్మనూరు జయరాం, కెవి.ఉషశ్రీచరణ్ తెలిపారు. వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర మంగళవారం సాయంత్రం రాయదుర్గంలో జరిగింది. తేరువీధిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో కార్మిక శాఖ మంత్రి జయరాం మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాల కాలంలో నవరత్నాలు అమలు చేసి ప్రజలందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రభుత్వం ద్వారా అందించామన్నారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలోనే రాష్ట్రంలో సామాజిక సాధికరత సాధ్యం అయ్యిందన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సీఎంని చేసి ఆదరించాలన్నారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక సాధికార యాత్రకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. రాయదుర్గంలో మాజీ మంత్రి కాలవ అవినీతికి మారుపేరుగా నిలిచారన్నారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పూర్తిగా న్యాయం చేశారన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ చంద్రబాబు అందరినీ మోసం చేశారన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలు 99.5 శాతం నెరవేర్చారన్నారు. జగన్ గొప్ప సంఘసంస్కర్త అని ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్ అన్నారు. ఈ సభలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, ఎమ్మెల్సీ మంగమ్మ, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రంగయ్య, బీసీ కార్పొరేషన్ జోనల్ ఇన్‌ఛార్జి రంగన్న గౌడ్, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పోరాలు శిల్ప, టిటిడి సభ్యులు అశ్వర్థనారాయణ, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భోజరాజు నాయక్, వైసిపి పట్టణ అధ్యక్షుడు శివప్ప, రాయదుర్గం పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వలీబాషాతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-544 భూ బాధితులకు న్యాయం చేయాలి

పురుగుల మందు డబ్బాలతో నిరసన



మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తున్న భూ బాధితులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సోములదొడ్డి నుంచి అమరావతి వరకూ వెళ్లే రహదారి 544 భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని బోడిగానిదొడ్డి గ్రామంలో పొలం సర్వే నంబర్ 112-2లో 47 మంది ఇళ్లు కోల్పోతున్నామన్నారు. అయితే గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే గతంలో నిర్ణయించిన మేరకు ఇవ్వకుండా పరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తమకు గతంలో ఇచ్చిన హామీ మేరకు పరిహారం చెల్లించాలని, లేకుంటే తమ తొలగింపును అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ రమాదేవి పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఎం.రాజగోపాల్, ఆర్.నాగరాజు, వి.కృష్ణ, వి.వేణుగోపాల్, వి.సత్యనారాయణ, పాలు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర


మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల రీసోర్స్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను చేపట్టాలన్నారు. అదేవిధంగా జీపీఎఫ్ అకౌంట్లను తెరవాలని డిమాండ్ చేశారు. గుంతకల్లు అర్బన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, రాజ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలు, మున్సిపల్ పాఠశాలల్లో అప్డేట్ కాకుండా మిగిలిపోయిన పోస్టులను అప్డేట్ చేయాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలని, పాఠశాలల కరెంటు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఈనెల 15న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అయినా స్పందించకుంటే 30న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అర్బన్ శాఖ నాయకులు మల్లికార్జున, శంకరయ్య, సిద్ధయ్య, సుధాకర్, యల్లన్న, రఫీ, రమేష్, ఖలీల్, వెంకటేష్, పెన్నయ్య, రూరల్ శాఖ ప్రధాన కార్యదర్శి కల్పన, మహిళా నాయకులు లావణ్య, యాస్మిన్, ఫసీహ తహసీన్, రెహనా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్
- అనంతలో 2కె రన్


2కె రన్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, దీనిని గుర్తించి ఓటు హక్కు కోసం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా మంగళవారం నాడు నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల వరకు 2కెరన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు, వారున్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేసే విధంగా 2కెరన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గ్రంధి వెంకటేష్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వరరెడ్డి, ఐఅండ్‌పిఆర్ డిఐపిఆర్‌ఒ గురుస్వామి శెట్టి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ భరత్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో లలితా బాయి, డిఎల్డీవో ఓబులమ్మ, తహశీల్దార్ బాలకిషన్‌తో పాటు అధికారులు, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం


సమావేశంలో పాల్గొన్న సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో ఉన్న అంబేద్కర్ భవన్‌లో స్థానిక అధ్యక్షుడు ఎన్. రామాంజనేయులు అధ్యక్షతన మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఈనెల 11,12,13వ తేదీల్లో 72 గంటల రిలే దీక్షలను విజయవంతం చేయాలన్నారు. గుత్తి మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారన్నారు. ఆనారోగ్యంతో మరణించిన నలుగురు కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షలు ఇవ్వాలన్నారు. కార్మికుల విధుల సమయంలో వేధింపులు ఆపాలన్నారు. సకాలంలో పనిముట్లు ఇవ్వాలన్నారు.జాతీయ సెలవులు కూడా మున్సిపల్ కార్మికులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. వారికి రావలసిన అంత్యక్రియల ఖర్చులు రూ. 15 వేలు ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికుల సంఘం అధ్యక్షులు సూరి, కోశాధికారి బాలు, ఉపాధ్యక్షుడు మహేష్,సుంకన్న, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సూరిపోగుల రాజా, మురళి, నరసింహ, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆధునీకరణకు ఆమోదం

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆధునీకరణకు జెఎన్‌టియు ద్వితీయ ఫైనాన్స్ కమిటీలో ఆమోదం లభించిందని ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. మంగళవారం స్థానిక విసి కాన్ఫరెన్స్ హాలులో ద్వితీయ ఫైనాన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు విసి తెలిపారు. ముఖ్యంగా ఎల్లోరా భాయ్స్ హాస్టల్ రెన్నోవేషన్, మరమ్మతులకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రార్ సి.శశిధర్, పాలకమండలి సభ్యులు డి.హరిచంద్ర రామ, బి.దుర్గాప్రసాద్, అంజలీ జేమ్స్ పాల్గొన్నారు

సక్రమంగా కులగణన జరగాలి

కెవిపిఎస్ నాయకులు జగ్గలి రమేష్


మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు జగ్గలి రమేష్

గుంతకల్లు : కులగణన కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఎస్సీ, ఎస్టీ కులాలకు చట్టబద్ధత కల్పించాలని కులగణన సదస్సులో కెవిపిఎస్ నాయకుడు జగ్గలి రమేష్ కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ భవానీ అధ్యక్షతన కుల గణనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణనలో సచివాలయ సిబ్బంది వాలంటీర్లపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. అధికారులు ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఇతర కులాల వాళ్లు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లినపుడు, డోర్ లాక్ చేసిన సమయంలో ఎలా కులగణన చేస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా జగదీష్ మాట్లాడుతూ శెట్టి, గుప్తా, వైశ్య కాకుండా తమవర్గానికి వైశ్యులుగా గుర్తించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సదస్సులో అన్ని కులాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

అధికారులకు సమ్మెనోటీసు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఎన్నోఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ షర్మిల, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.జనార్ధన్‌కు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ విజయేంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కన్నాంగా ఎక్కువ వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మెయిన్ టీచర్లకు ఇచ్చే వేతనం ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్‌ను రూ.5 లక్షలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్ల నిబంధనలను రూపొందించాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని ఈనెల 8వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. సమ్మెకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులకు నోటీసు అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శివశంకర్, రాము, అంగన్వాడీ టీచర్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీలకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఉరవకొండ ప్రాజెక్ట్ కార్యదర్శి విజయ, అరుణకాంతమ్మ డిమాండ్ చేశారు. ఈమేరకు అంగన్వాడీల ఆధ్వర్యంలో ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో తహశీల్దార్ ఈరమ్మ, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎస్ఐకి వేర్వేరుగా నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8వ తేదీ నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గర్భిణులు, ఆరేళ్లలోపు చిన్నారులు, కిషోర్ బాలికలకు అంగన్వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో సేవలందిస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, విడపనకల్లు మండల అంగన్వాడీ కార్యకర్తలు వనజ, ప్రేమలత, గౌసియా, సుమంగళమ్మ, కళ్యాణి, త్రివేణి, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అంగన్వాడీలు తలపెట్టిన సమ్మెకు టిడిపి మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి తెలిపారు. మంగళవారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయానికి పలువురు అంగన్వాడీలు హాజరై డిసెంబర్ 8న నిర్వహించే సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌చౌదరి మాట్లాడుతూ అంగన్వాడి సమ్మెకు టిడిపి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వేతనం పెంచాలని, పనిఒత్తిడి తగ్గించాలని వారి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, పావురాల శేఖర్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : రాష్ట్రవ్యాప్తంగా ఐసిడిఎస్ సంస్థలో పనిచేస్తున్న అంగన్వాడీలు, హెల్పర్లు, మినీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 8వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి మేరీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా గుమ్మగట్ట మండల కేంద్రంలో శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని నిరసన తెలపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు చంద్రకళ, రాధిక, రుద్రమ, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

ఆటలు ఆడుదాం..ఆరోగ్యంగా ఉందాం..

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో ఆటలు ఆడి ఆరోగ్యంగా ఉందామని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమానికి సంబంధించిన క్రీడా సామగ్రిని డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మితో కలిసి సచివాలయ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా యువతను క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు సిఎం జగన్ ఆడదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడమే సిఎం జగన్ ప్రధాన లక్ష్యమన్నారు. అంతేగాకుండా సిఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. కమిషనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దేశ చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరంగా నిలిచి పోతుందన్నారు. ఇప్పటికే వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సిఎం జగన్ పెద్దఎత్తున ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌బాబు, శ్రీనివాసులు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఇఇ సూర్యనారాయణ, డిఇ ద్రాక్షాయణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం దగ్గర ఉన్న మండల పరిషత్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా సంబంధించిన క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దేవేష్, జెడ్‌పిటిసి నీలం భాస్కర్, సర్పంచ్ పార్వతి, ఎంఇఒలు గురు ప్రసాద్, లింగానాయక్ మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ 'ఆడుదాం ఆంధ్రా'కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి దామోదరమ్మ, పీఈటీ గోపాల్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా సామగ్రిని అందజేస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

విద్యార్థినులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి : ఎంపిపి

ప్రజాశక్తి-ఉరవకొండ

వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఆయా వార్డెన్లు కన్నబిడ్డల్లా చూసుకోవాలని పుష్పావతి భీమిరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌ను ఎంపిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హాస్టల్ సిబ్బంది, వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా.. లేదా.. అని విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తర్వాత రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కావున ప్రభుత్వం కేటాయించిన మెనూప్రకారం రుచికరంగా, నాణ్యతతో పౌష్టికాహారం అందించాలన్నారు. అలాగే సిబ్బంది హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలను తమ బిడ్డలుగా జాగ్రత్తగా, ఆరోగ్యకరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లు, ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శాంతకుమారి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, ఎంపిటిసి ఓబులేసు, హేమంత్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌పై చర్యలు తీసుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వ కార్యాలయాలను దొడ్డిదారిన విశాఖకు తరలిస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న సిఎం జగన్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ రాజధాని అంశంపై కోర్టు తీర్పులను లెక్కజేయకుండా దొడ్డి దారిలో ప్రభుత్వ కార్యాలయంలో విశాఖకు తరలించడం చట్ట విరుద్ధమని మండిపడ్డారు. రాజధాని అమరావతి నుంచి ప్రభుత్వ కార్యాలయలను విశాఖకు తరలించడాన్ని న్యాయస్థానాలే అడ్డుకోవాలన్నారు. ఇప్పటికైనా ఉన్నత న్యాయస్థానాలు స్పందించి సిఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.గోవిందు, మహేష్, ఎస్ఎండి గౌస్, రాముురాయల్, ఈశ్వరయ్య, దేవేంద్ర, వెంకట్‌నాయక్, పిసి కుళ్లాయప్ప, వేణు, శ్యాంసుందర్, సతీష్‌నాయక్, నరసింహా, పులికొండ, రమేష్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

బొమ్మనహాల్ : మండలంలోని కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతుసంఘం మండల కార్యదర్శి ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామ పరిధిలో 250 మంది రైతులకు కౌలురైతు కార్డులు మంజూరు చేశారన్నారు. వీరందరికీ ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఇంకా వాస్తవంగా సాగులో ఉన్న రైతులకు కౌలు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇకపోతే ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.30వేల వరకూ పెట్టుబడి పెట్టి హెచ్చెల్సీ కింద పంటలుసాగు చేశారన్నారు. అయితే అర్ధాంతరంగా నీటిని నిలిపివేయడంతో రైతులు రూ.లక్షలు నష్టపోతున్నారన్నారు. అలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం : జిల్లాలోని పని చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రతాప్‌నారాయణ ఆధ్వర్యంలో రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోనికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ సిబ్బంది అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా కార్యవర్గ సభ్యులు పుల్లయ్య, రెడ్డి, సదాశివరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గార్లదిన్నె : కళ్యాణదుర్గం వేదికగా ఈనెల 6, 7వ తేదీల్లో జరుగుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, సహాయ కార్యదర్శి సిద్ధు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శరత్, సుమంత్, అజయ్, మనోజ్, కార్తీక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేల, నీరు మానవ జీవనానికి మూలం

ప్రపంచ నేలల దినోత్సవంలో భూసార శాస్త్రవేత్త డాక్టర్ కెసి నటరాజు

ప్రజాశక్తి-నార్పల

మానవ జీవనానికి నేల, నీరు చాలా ముఖ్యమని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కెసి నటరాజు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని కేసేపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి చెన్న వీరాస్వామి ఆధ్వర్యంలో మట్టి, నీటి సమర్థతపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వ్యవసాయంలో మంచి దిగుబడికి నేల స్వభావం, నీరు అత్యంత ముఖ్యం అన్నారు. నేలను సంరక్షించుకోవడంతో రైతులు ముందుకు రావాలన్నారు. నేలను సంరక్షించాలంటే సేంద్రియ పదార్థాలు అందించడం ఏకైక మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.లక్ష్మణ్, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ డి.నాగలింగారెడ్డి, డాక్టర్ జిడి.ఉమాదేవి, మండల, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో 'నేల, నీరే జీవరాశి అంతటికీ జీవనాధారం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ నేల పోషక నష్టం అనేది పోషకాహారాన్ని బెదిరించే ప్రధాన నేల క్షీణత ప్రక్రియ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత, స్థిరత్వం కోసం ప్రపంచ స్థాయిలో అత్యంత ముఖ్యమైన సమస్యల్లో ఒకటిగా గుర్తించారన్నారు. ఇందులో భూమి కీలకపాత్ర అని భావించి ప్రపంచవ్యాప్తంగా అవగాహనను పెంచడానికి, బాధ్యతాయుతమైన నేల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ నేలను పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మృత్తిక శాస్త్ర సహాయ ఆచార్యులు కొండారెడ్డి, కవిత, ఉష, కళాశాల బోధనా సిబ్బందితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూసార శాస్త్రవేత్త డాక్టర్ కెసి నటరాజు

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని మడుగుపల్లిలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రావణిశ్రీ మాట్లాడుతూ 'ఒక్క ఛాన్స్' అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. ముఖ్యంగా వివిధ రకాల పన్నులు, ఛార్జీలు పెంచి పేదల నడ్డి విరిచారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, కడవకల్లు గోవర్ధనరాజు, హరి, రంగయ్య, సాంబశివారెడ్డి, బ్రహ్మయ్య, కార్యకర్తలు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : రాష్ట్రంలో ఏం అభివృద్ధి జరగాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అస్మిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలం పరిధిలోని చిన్న యక్కులూరి గ్రామంలో 'బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, కుసుమారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, తురకపల్లి అజిత్‌రెడ్డి, సంజీవరెడ్డి, పెద్దలూరు ఓబిరెడ్డి, యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, చాగల్లు శంకర్, సింగనగుట్టపల్లి రాజు, నాగరాజు, సాంబడు, చిక్కేపల్లి చెన్నారెడ్డి, వెంకట శివారెడ్డి, పసునూరి సర్పంచ్ శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మడుగుపల్లిలో పర్యటిస్తున్న బండారు శ్రావణిశ్రీ

తాగనీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 16 వార్డులో ఉన్న జెండా కట్ట ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైప్ లైన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.శ్రీనివాసులు, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, ఎఇ సాయినాథ్‌బాబు, కౌన్సిలర్ నరేష్, నాయకులు షఫీ, షేక్షావలి, మైను, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై దాడులు

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు జిల్లాలోని పలు చౌకధాన్యపు దుకాణాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు విజిలెన్స్ సిఐ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలోని నేతాజీనగర్, మున్నానగర్, నెహ్రూకాలనీతోపాటు ఉరవకొండ ప్రాంతాల్లో ఉన్న పలు చౌకధాన్యపు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా దుకాణాల నిల్వల్లో వచ్చిన తేడాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శేషగిరి, జైపాల్‌రెడ్డి, వాసుప్రకాష్, రెవెన్యూ అధికారులు మహబూబ్ బాషా, కంబక్క, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దపప్పూరు : బాలికలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శరత్‌చంద్రారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని జూటూరు కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థినులకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాన్నారు. లేకుంటే తమకు, 100కు సమాచారం అందించాలన్నారు. అలాగే బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. వీటితోపాటు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తిట్లు, శాపనార్థాలే సామాజికయాత్ర లక్ష్యమా? : 'కాలవ'

రాయదుర్గం : ప్రతిపక్ష నాయకులను తిట్టడం, శాపనార్థాలు పెట్టడమే సామాజిక సాధికార బస్సుయాత్ర లక్ష్యమా.. అంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రాయదుర్గంలో సాయంత్రం మందుబాబుల ముందు మాట్లాడిన వైసిపి మంత్రులు, ఇతర నాయకులు తనను, తమ అధినేత చంద్రబాబును పచ్చిబూతులు తిడుతూ ఊగిపోయారన్నారు. నాలుగున్నరేళ్లలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధిని సర్వనాశనం చేసిన జగన్ రెడ్డి తరపున మంత్రులు ఏ ముఖం పెట్టుకుని ప్రజల ముందుకొచ్చారని నిలదీశారు. అధికార పదవుల్లో ఉన్న వారు హుందాగా వ్యవహరించాల్సింది పోయి ఇష్టమొచ్చినట్లు నోరుపారేసుకోవడం బాధాకరమన్నారు. రాయదుర్గంలో సామాజిక యాత్రకు స్థానిక ప్రజల నుంచి స్పందన కరవైందన్నారు. విప్‌కాపు రామచంద్రారెడ్డి కర్ణాటక నుంచి తెచ్చుకున్న కూలి జనంతో మమ అనిపించారన్నారు.

వైసిపితోనే ప్రజలకు మేలు

ఉరవకొండ : బడుగు, బలహీన వర్గాలకు మేలు జరగాలంటే వైసిపితోనే సాధ్యమని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి బోయ హనుమంతు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామ సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలో లబ్ధిపొందిన వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, ఎంపిటిసి తిమ్మరాజు, ఎంఎల్‌ఓ కుళ్లాయిస్వామి, వైసీపీ సీనియర్ నాయకులు హనుమంతు, సంజప్ప, రాఘవేంద్ర, చిట్టిబాబు, సునీల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సింగాడి వీరప్ప, మహేష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైల్వే డీజిల్‌షెడ్ వార్షికోత్సవం

గుత్తి : రైల్వే గుత్తి డీజిల్ లోకో షెడ్ 60వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా సిసిఇ ఎస్ సి పీడీ మిశ్రా, గుంతకల్లు డిఆర్ఎం మనీష్ అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత డీజిల్ లోకోషెడ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఎడిఆర్ఎం సుధాకర్, సూర్యనారాయణ, ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు లతా మిశ్రా, గుంతకల్లు అధ్యక్షురాలు నీతి అగర్వాల్, గుత్తి సీనియర్ డిఎంఈ రమేష్, డిఎంఈ ప్రమోద్, రేవతి, ప్రియాంక, రైల్వే యూనియన్ నాయకులు, కార్మికులు పెన్షనర్లు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తెలంగాణ ప్రభావం రాష్ట్రంపై ఉండదు.. : మంత్రి

రాయదుర్గం : ఇటీవల వెలువడిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం రాష్ట్రంపై ఏమాత్రం ఉండదని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మంచి చేయాలన్న దృఢ సంకల్పంతో సిఎం జగన్ ముందుకెళ్తున్నారన్నారు. ప్రజలు ఏ సచివాలయానికి వెళ్లినా అక్కడ పనితీరును బట్టి పరిస్థితిని అంచనా వేయవచ్చన్నారు. ఈనేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి టిడిపి నాయకులు ఓర్వలేక తమ ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేయిస్తున్నారన్నారు. ఇది రాబోయే రోజుల్లో వారికి తీవ్రమైన నష్టం, పతనం కలిగిస్తుందన్నారు. మంత్రి జయరాం మాట్లాడుతూ తాను గతంలో అసెంబ్లీలో వాల్మీకులకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీశానన్నారు. అందుకే అప్పట్లో కాలవ శ్రీనివాసులకు మంత్రి పదవి దక్కిందన్నారు. ఈ విషయం ఆయన గ్రహించాలన్నారు. జిల్లాలో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అనేక పదవులను ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వారి అభ్యున్నతికి పాటుపడుతోందన్నారు.

'ఎస్‌వి'లో ముగిసిన పరిశీలన

అనంతపురం : నగరంలోని ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజులుగా నాక్ పీర్ టీం పరిశీలన మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా నాక్ టీం సభ్యులు విజయ్‌కుమార్, ఎం.ఖాలిద్ అజాం, అలీగర్, అలీగళ్, శైలజాకుమారి, జవరాజేగౌడ, ఎ.వి.కాంతమ్మ, తదితరులు కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సోమశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదనరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధక విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం : పరిశోధక విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ విద్యార్థి సంఘాల నేతలు ఇన్‌ఛార్జి వీసీ చింతా సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు, వైఎస్ఆర్‌యు రాష్ట్ర నాయకులు హేమంత్‌కుమార్, వాసు, నాయకులు నవీన్, శంకర్, మహేష్, నరేష్, కులశేఖర్, అంజి, తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ లక్ష్మి కుటుంబానికి ఆర్థికసాయం

నార్పల : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బి.సి గురుకుల బాలికల పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న లక్ష్మీ భర్త ఎస్.నారాయణస్వామిమృతి చెందడంతో పాఠశాలలో పని చేస్తున్న సిబ్బంది ఆర్థికసాయం అందజేశారు. ఇందులో భాగంగా కుటుంబ ఖర్చులకు రూ.20వేలు, లక్ష్మి ముగ్గురు పిల్లలకు ఒక్కొక్కరి పేర రూ.27వేల చొప్పున ఎస్‌బిఐ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని వినతి

బొమ్మనహాల్ : వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మండలంలోని కొలగానహళ్లి గ్రామానికి చెందిన వాల్మీకులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి విజయమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకులు మాట్లాడుతూ తమ గ్రామంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేసేందుకు గ్రామకంఠంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఇందుకు అధికారులు స్పందిస్తూ మీ వినతిని జిల్లా కేంద్రానికి పంపుతామని, అక్కడి నుంచి సమాచారం వచ్చిన తర్వాత సమాచారం అందిస్తామని తెలిపారు.

బోర్లు మంజూరు చేయండి

ఉరవకొండ : నియోజకవర్గంలో అర్హత కలిగిన రైతులకు వైఎస్ఆర్ జలకళ కింద బోర్లు మంజూరు చేయాలని రాష్ట్ర వాటర్‌షెడ్, వైఎస్ఆర్ జలకళ డైరెక్టర్ వెంకటరెడ్డిని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో జలకళ కింద పెండింగ్‌లో అనేక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రైతులకు సాగునీటి కోసం మెరుగైన నీటి సరఫరాను అందించడానికి సిఎం జగన్ తీసుకొచ్చిన వైఎస్ఆర్ జలకళ కార్యక్రమం ఉరవకొండ నియోజకవర్గంలో నత్తనడకన సాగుతోందన్నారు. అధిక శాతం మెట్ట భూములు ఉన్న నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతిరైతుకూ బోరు మంజూరు చేసి వెంటనే వేయాలని కోరారు.

మిరప రైతులను ఆదుకోవాలి

పామిడి : నష్టపోయిన మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎరుకల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే గోవింద్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని గజరాంపల్లి గ్రామంలో నష్టపోయిన మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు వంద ఎకరాల్లో రైతులు మిరప సాగు చేస్తున్నారన్నారు. ఆయా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వెంటనే మిరప రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

ఉరవకొండ : మండలంలోని నేరిమెట్లలో రైతు జి.వరలక్ష్మి పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలో మంగళవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శుభకర్, గ్రామ రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు పలు అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ర్యాగింగ్ నిరోధం, మాదక ద్రవ్యాల పర్యావసనాలు, బాల్య వివాహాల చట్టం, దిశాయాప్, సైబర్ నేరాలు, డయల్-100, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు, తదితర అంశాలపై అవగాహన చేశారు.

కులగణనపై సమీక్ష

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో కులగణనపై మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, తహశీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కులగణన వివరాలను ఈనెల 9 నుంచి 18వ తేదీలోపు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి నిరవధిక సమ్మె

బెలుగుప్ప : కేంద్ర సంఘాల పిలుపుమేరకు ఈనెల 7వతేదీ నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని తపాలా శాఖ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణయాదవ్ కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను అమలు చేయాలని, రెగ్యులర్ జిడిఎస్‌లు, సెలవు పెట్టినప్పుడు వర్క్‌లోడ్‌తో సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ను అనుమతి అనుమతించాలని సమ్మెలోకి వెళ్తున్నట్లు వివరించారు. అనంతరం సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్లానాయక్, జయరాములు, శివానంద, అంజలి, శ్వేత, కార్తీక్, ఆనంద్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

అనంతపురం : వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరియా విభాగం ఉమ్మడి అనంతపురం జిల్లా సబ్ యూనిట్ అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌యూనిట్ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే, వెక్టర్, కంట్రోల్ హైజిన్, మోసక్విటో, లార్వా డెన్సిటీ, మలేరియా, డెంగీ కేసులకు యాక్షన్ టేకెన్, ఈ ఔషధి వంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి మలేరియా సహాయ అధికారి లక్ష్మీనాయక్, విస్తరణ అధికారులు గిరిధర్‌రెడ్డి, రమేష్, సూపర్‌వైజర్లు రమేష్‌బాబు, లోకేశ్వరరెడ్డి, ఉమ్మడి జిల్లాల సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.